



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తూ సామాన్యులతో మాట్లాడుతున్న చంద్రబాబు



జిల్లా వ్యాప్తంగా తిరంగా పండుగ వైభవంగా జరిగింది. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని రేకెత్తించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్తేజపరిచాయి. దేశభక్తిని పెంపొందించేలా కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణల్లో చిన్నారుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో.. పార్టీ ఆఫీసుల్లో... విద్యా సంస్థల్లో... ప్రైవేటు సంస్థల్లో 78వ స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి.

జెండా వందనంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

మా తుఝే సలాం!



జాతీయ జెండాతో ర్యాలీగా వస్తున్న కలెక్టర్ బాలాజీ

జిల్లాలో వైభవంగా 78వ స్వాతంత్ర్య వేడుకలు

- స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు
- ఆకట్టుకున్న కళారూపాలు



మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం/మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలో 78వ స్వాతంత్ర్య వేడుకలు స్థానిక పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా జరిగాయి. రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుకల్లో ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో పోలీసు కవాతు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విశేష సేవలు అందించినవారికి కలెక్టర్ డి.కె.బాలాజీతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని ప్రభోదించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

విద్యార్థులు ప్రదర్శించిన పలు నాట్య ప్రదర్శనలు, దేశభక్తిని ప్రబోధించాయి. ఈ ప్రదర్శనలో జిల్లా పరిషత్ చిన్నాపురం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన హర్ ఘర్ తిరంగాకు ప్రథమ, నిర్మలా హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఏక్‌తేరా నామ్ ద్వితీయ బహుమతి అందించారు. కోలవెన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేస్తూ అందించిన ప్రదర్శనకు తృతీయ బహుమతి లభించింది. ఉయ్యూరు విశ్వశాంతి స్కూల్ విద్యార్థులు బ్యాండు వాయిస్తూ ప్రదర్శించిన నృత్యం ఉత్సాహపరిచింది.



ప్రథమ బహుమతి సాధించిన విద్యాశాఖ శకటం



చిన్నారుల విన్యాసం



స్వాతంత్ర్య పోరాట యోధుల వేషధారణలో చిన్నారులు

● జిల్లా ప్రగతికి ప్రతిబింబాలుగా శకటాలు

వేడుకల్లోని శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. కొన్ని శకటాల్లో చిత్రాలు, బొమ్మలే కాకుండా లైవ్ అంశాలను ప్రకటించారు. వీటిలో విద్యాశాఖ సమగ్ర శిక్ష శకటం ప్రథమ బహుమతి సాధించింది. నీటి యాజమాన్య సంస్థ శకటం ద్వితీయ బహుమతి సాధించింది. జిల్లాలో పనికి ఆహార పథకం కింద చేపడుతున్న సేవలకు ఈ శకటం అద్దం పట్టింది. వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ శకటాలు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను చాటి చెప్పాయి. వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ప్రగతికి దర్పణాలుగా నిలిచాయి.

ప్రజలతో మమేకమై..

పేదల పక్షాన కూటమి ప్రభుత్వం ఉంటుందని సీఎం చంద్రబాబు హామీ

- అల్పాదాయం ఉన్నవారికి బాసటగా ఉంటామని సీఎం భరోసా
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గృహనిర్మాణ పనులు పెరిగాయా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా
- ఈ-వెహికల్స్ ద్వారా చిరు వ్యాపారాలు చేసుకోవాలని సూచన
- గుడివాడలో అన్న క్యాంటీన్‌లో ప్రజలతో కలిసి చంద్రబాబు దంపతుల భోజనం
- అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు ఎంపీ, ఎమ్మెల్యేల విరాళం రూ.50 లక్షలు

మచిలీపట్నం/గుడివాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో ముఖ్యమంత్రి పర్యటన అంటే పోలీసుల ఆంక్షలు, పరదాలు కట్టి జనం రోడ్లపైకి రాకుండా నిబంధనలు, ప్రతిపక్ష నాయకుల ముందస్తు గృహ నిర్బంధాలు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుడివాడలో గురువారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన సమయంలో ఎలాంటి ఆర్భాటాలూ లేవు. అన్న క్యాంటీన్ ప్రారంభంలో సీఎం చంద్రబాబు ప్రజలతో మమేకమయ్యారు. పేదలకు అన్నక్యాంటీన్‌లు గతంలో ఎలా ఉపయోగపడ్డాయి, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నక్యాంటీన్లను మూసివేయడంతో ఎటువంటి ఇబ్బందులు పడ్డారో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీఎం సతీమణి భువనేశ్వరి స్వయంగా పేదలకు భోజనం వడ్డించారు. వారితో పాటే కలిసి సీఎం దంపతులు కూడా భోజనం చేశారు. పేదలకు మేలు చేసేందుకు, వారికి మూడు పూటలా రూ.15 ఖర్చుతో పట్టెడన్నం పెట్టేందుకు జీవితాంతం కృషి చేస్తానని సీఎం ఈ సందర్భంగా అన్నారు.

● ప్రజల బాధలు తెలుసుకుంటూ..

ముఖ్యమంత్రి చంద్రబాబు చిరువ్యాపారులు, వివిధ షాపుల్లో పనిచేసే కార్మికులతో మాట్లాడి వారికి వచ్చే ఆదాయం, కుటుంబ నిర్వహణ కోసం అయ్యేరోజువారీ ఖర్చు, అన్న క్యాంటీన్‌లో తక్కువ ధరకే భోజనం పెడితే వారికి జరిగే మేలును ప్రజలతో మాట్లాడి వివరాలు రాబట్టారు. గిల్టు నగల వ్యాపారం చేసే తమ్మిశెట్టి నాగమణి మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి గిల్టు నగలు విక్రయిస్తూ ఉంటానని, గుడివాడ చేరుకుని హోటల్‌లో భోజనం చేస్తుంటానని దీంతో ఖర్చు పెరుగుతోందని అన్నారు. అన్న క్యాంటీన్‌లు అందుబాటులోకి రావడంతో తనకు ఖర్చులు కలిసి వస్తాయని ఆమె అన్నారు. ఇద్దరు పిల్లలను పోషించడం కష్టతరంగా మారిందన్నారు. నాగమణికి ఎలక్ట్రికల్ స్కూటీని కొని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బాలాజీకి సీఎం సూచించారు. చిన్నపాటి టిఫిన్ బండి నడుపుకునే తాను సరైన పెట్టుబడి లేక, తన భర్త ఇసుక వ్యాపారం కూడా దెబ్బతినడంతో ఆర్థికంగా కుంగిపోయామని, దుకాణంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని గాదంశెట్టి విజయలక్ష్మీ చంద్రబాబుకు మొరపెట్టుకున్నారు. గుడివాడ పట్టణంలో సెక్యూరిటీ గార్డుగా తాను పనిచేస్తున్నానని, గతంలో అన్న క్యాంటీన్‌లో ఐదు రూపాయలకు భోజనం చేసేవాడినని ఆశిష్ తెలిపారు. గత ప్రభుత్వం అనాలోచిత అన్న క్యాంటీన్‌ను మూసివేయడంతో తనలాంటి చిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. తిరిగి అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, డైరెక్టర్ హరినారాయణ, సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న, అక్షయపాత్రట్రస్ట్ సీఈవో కాంతేయదాస, పురపాలకశాఖ రీజనల్‌డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు, గుడివాడ ఆర్డీవో పద్మావతి, గుడివాడ మునిసిపల్ కమీషనర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గుడివాడకు ప్రాధాన్యం

టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు పుట్టినగడ్డ అయిన గుడివాడకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రంలో మొదటిసారి గుడివాడలోని అన్న క్యాంటీన్‌ను ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఎన్టీఆర్ రూ.2లకు కిలో బియ్యం అందిస్తే, చంద్రబాబు కేవలం రూ.5లకే భోజన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిమాట్లాడుతూ కృష్ణాజిల్లా శివారుప్రాంతం కావడంతో తాగునీటి సమస్య ఉందని, మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పెనమలూరులను యూనిట్‌గా తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కోరారు.

తమ్ముడితో ఆడుకుంటూ..

చెరువులో పడి బాలిక మృతి



ఉంగుటూరు, ఆగస్టు 15 : తమ్ముడితో కలిసి చెరువుగట్టుపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ చెరువులో పడి బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని ఆత్కూరు గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఆత్కూరు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అక్కినేని చైతన్య, అంజలి దంపతులకు మానస (7), కార్తికేయ ఇద్దరు పిల్లలు. మానస పెద్దది. మానస స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం సాయంత్రం స్కూలు నుంచి ఇంటికి రాగానే తమ్ముడు కార్తికేయతో కలిసి ఇంటి సమీపంలో ఉన్న కోనేరు చెరువుగట్టు వద్దకు ఆడుకునేందుకు వెళ్లింది. కొద్దిసేపు తర్వాత 'ఇంటికి వెళ్దాం రా' అని తమ్ముడు అడగ్గా.. 'కాసేపు ఊయల ఊగి వస్తా' అని చెప్పి ఆగిపోయింది. చీకటి పడుతున్నా మానస ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి అంజలి చెరువు వద్దకు వెళ్లి అక్కడ పాప లేకపోవడంతో బంధువులతో కలిసి ఊరంతా గాలించింది. రాత్రి 10.30 గంటల సమయంలో ఆత్కూరు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన ఎస్సై సురేష్ సిబ్బందితో పాప ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున బాలిక శవం నీటిలో తేలియాడుతూ కనిపించింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాపకు ఫిట్స్ ఉండటంతో ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

అటవీశాఖలో ఇద్దరిపై వేటు

రిజర్వు ఫారెస్టులో అక్రమాలపై నివేదిక

ఉన్నతాధికారుల సీరియస్

విజయవాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం, జి.కొండూరు మండలంలో వైసీపీ పాలనలో రిజర్వు ఫారెస్టులో జరిగిన అక్రమాలపై అటవీశాఖ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలపై అధికారులు స్పందించారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, వేమవరం, పాతపాడులలో జరిగిన అక్రమ తవ్వకాల్లో బీట్ ఆఫీసర్ రంపవరపు సునీతపై అటవీశాఖ ఉన్నతాధికారులు వేటు వేశారు. ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సమయంలో ఇక్కడ డిప్యూటీ రేంజర్‌గా పనిచేసిన విజయశేఖర్‌పైనా చర్యలకు సిద్ధమవుతున్నారు. 2019 నుంచి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు వరకు కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, వేమవరం, పాతపాడు, జి.కొండూరు మండలం వెలగలేరులో ఉన్న రిజర్వు ఫారెస్టులో వైసీపీ నేతలు విచ్చలవిడిగా తవ్వకాలు చేశారు. కొండలను గుల్ల చేశారు. అటవీశాఖ భూములకు, రెవెన్యూ భూములకు మధ్య ఉన్న సరిహద్దు రాళ్లను తొలగించారు. పగలు, రాత్రి తేడా లేకుండా అటవీశాఖకు చెందిన కొండలను గ్రావెల్ కోసం పిండి చేశారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసిన వారిని వైసీపీ గూండాలు బెదిరించారు. జిల్లా అటవీశాఖాధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమార్కులు చెలరేగిపోయారు. ఆయా గ్రామాలకు చెందినవారు అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేసినా జిల్లా అధికారులు ఎలాంటి అక్రమాలూ జరగలేదని నివేదికలు ఇచ్చారు. చివరికి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, లోకాయుక్త జోక్యం చేసుకోవడంతో అటవీశాఖ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అటవీశాఖ విజిలెన్స్ అధికారులు ఇక్కడ సర్వే చేసి సరిహద్దు రాళ్లను మాయం చేసిన మాట వాస్తవమేనని నిర్ధారించారు. రెవెన్యూ భూములను దాటుకుని వచ్చి రిజర్వు ఫారెస్టులో తవ్వకాలు చేశారని గుర్తించారు. ఈ నివేదికను ఎన్జీటీ, లోకాయుక్తకు అందజేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు రావడంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఇక్కడ బీట్ ఆఫీసర్‌గా ఉన్న సునీతను సస్పెండ్ చేశారు. ఆ సమయంలో ఇక్కడ డిప్యూటీ రేంజర్‌గా పనిచేసిన విజయశేఖర్‌ను అధికారులు ఇప్పటికే ఉద్యోగం నుంచి తొలగించారు. ఏలూరు జిల్లాలో జామాయిల్ చెట్ల లెక్కల్లో తేడాలు రావడంతో ఆయనపై చర్యలు తీసుకున్నారు. విజయవాడ రూరల్ మండలంలోని రిజర్వు ఫారెస్టులో జరిగిన అక్రమాల్లోను విజయశేఖర్ పాత్ర ఉండడంతో దానిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు ఫైళ్లను సిద్ధం చేస్తున్నారు.

వైసీపీ నేతల కనుసన్నల్లో వాహన్ స్కామ్!



వైసీపీ హయాంలో బెజవాడ, సూళ్లూరుపేటల కేంద్రంగా రవాణా శాఖలో జాతీయ స్థాయిలో జరిగిన 'వాహన్ స్కామ్' వ్యవహారం మరుగున పడింది. ప్రాథమికంగా స్కామ్ జరిగిందని వెలుగు చూసినా.. తూతూ మంత్రపు చర్యలు చేపట్టారే కానీ సమగ్ర విచారణకు ఆదేశించలేదు. అప్పటి రవాణా శాఖ కమిషనర్‌గా ఉన్న సీతారామాంజనేయులు జాతీయ స్థాయి కుంభకోణంపై సమగ్ర విచారణకు ఆదేశించకపోవటంతో రవాణా శాఖలో అతిపెద్ద స్కామ్ మూలన పడిపోయింది. ఈ స్కామ్‌లో లబ్ధి పొందింది వైసీపీ నేతలు, వారి బంధువులే. దీనికి సహకరించిన ప్రైవేటు మాఫియా, రవాణా శాఖ పరంగా పాత్ర పోషించిన అధికారులు సేఫ్‌జోన్‌లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే అక్రమార్కులు బయటికొస్తారు.

వాహనాలే లేకుండా 365 వాహనాల పేరుతో ఆర్‌సీలు

- వైసీపీ నాయకుల బంధువులకే నకిలీ సీ బుక్‌లు
- పట్టించుకోని రవాణా శాఖ కమిషనర్
- వైసీపీ ప్రభుత్వ హయాంలో నీరుగారిన విచారణ
- స్కామ్‌లో పాత్రధారులు, సూత్రధారులంతా సేఫ్
- నకిలీ ఆర్‌సీలు పొందిన వారిపైనా కేసులు లేవు
- సమగ్ర విచారణకు ఆదేశిస్తేనే అక్రమార్కులు దొరికేది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వాహనాలు ఏమీ లేకుండా మొత్తం 365 వాహనాలు ఉన్నట్టుగా చూపి లేని ఈ-వాహనాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు (ఆర్‌సీ) ఇప్పించారు. కేంద్ర ప్రభుత్వ వాహన రిజిస్ట్రేషన్ పోర్టల్ అయిన 'వాహన్'ను ట్యాంపరింగ్ చేసి ఈ భారీ కుంభకోణానికి ఒడిగట్టారు. ఈశాన్య రాష్ట్రాలైన ఉత్తరాంచల్, అరుణాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, బీహార్ తదితర రాష్ట్రాల్లో అక్కడ లేని వాహనాలను ఉన్నట్టుగా వాహన్ వెబ్ పోర్టల్‌లో చూపించారు. వాహన్ పోర్టల్‌ను ట్యాంపరింగ్ చేసి దొంగ ఛాసిస్, ఇంజిన్ నెంబర్లతో నమోదు చేయించారు. ఇవన్నీ దాదాపుగా ఆయిల్ ట్యాంకర్లకు సంబంధించినవి. ఏపీకి చెందిన వైసీపీ నేతలు, వారి బంధువులు కొందరు ఆయిల్ కంపెనీల్లో ట్యాంకర్ల అగ్రిమెంట్లు కుదుర్చుకున్నారు. టెండర్ల నిబంధనల ప్రకారం కాలపరిమితి తీరిన వాహనాల స్థానంలో తిరిగి తగిన కాలపరిమితి ఉన్న వాహనాలను ప్రవేశపెట్టాల్సి ఉంది. దీంతో వీరంతా విజయవాడలోని ముద్ర సుబ్బారావు అండ్ కో మాఫియాను ఆశ్రయించారు. ముద్ర సుబ్బారావు అండ్ కో గ్యాంగ్ వాహన్ పోర్టల్‌ను ట్యాంపరింగ్ చేయటంతో పాటు లేని వాహనాలను రిజిస్ట్రేషన్లు చేయించింది. విజయవాడ కేంద్రంగా ఈ వ్యవహారం నడిపిస్తే అనుమానం వస్తుందన్న ఉద్దేశంతో.. ఇక్కడి నుంచి కేవలం ఆయా వాహనాలకు సంబంధించి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేయించాడు. అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సూళ్లురుపేటలో వీటికి ఫిజికల్ వెరిఫికేషన్ చేయించాడు. అసలు వాహనాలే లేకపోయినా.. అక్కడి అవినీతి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) నాయక్ వాహనాలను పరిశీలించినట్టుగా ఫిజికల్ వెరిఫికేషన్, ఫిట్నెస్ కూడా ఇచ్చేశారు. ఈ వ్యవహారంలో అక్కడి ఆర్‌టీవో కూడా సహకారం అందించారు. విజయవాడలో 40 వాహనాల వరకు అసలు అవి లేకుండానే ఉన్నట్టుగా స్థానిక అధికారి విఠల్ ద్వారా వాహన్ సైట్‌ను ట్యాంపరింగ్ చేయించి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ జాతీయ స్థాయి కుంభకోణాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకు వచ్చింది. దీనిపై రవాణా శాఖ అధికారులు ప్రాథమిక విచారణలో స్కామ్ జరిగినట్టుగా వెలుగుచూసింది. ఈ వ్యవహారంపై మరింత సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉందని రిపోర్టు ఇచ్చారు. సమగ్ర విచారణకు ఆదేశిస్తామని చెప్పిన అప్పటి రవాణా శాఖ కమిషనర్ సీతారామాంజనేయులు ఆ తర్వాత వదిలేశారు. ఈ అక్రమంలో 365 మందికిపైగా అయాచిత లబ్ధి పొందారు. వైసీపీ నాయకులు, వారి బంధువులు పొందిన అక్రమ ఆర్‌సీల కారణంగా ఆయిల్ కంపెనీలకు కొత్త వాహనాలు కొనకుండానే.. ఉన్న వాహనాలకే ఛాసిస్, ఇంజిన్ నెంబర్లను మార్ఫింగ్ చేయించారు. తాము పొందిన నకిలీ ఆర్‌సీలను సమర్పించి పాత వాహనాల లైఫ్‌ను పెంచుకున్నారు.

సేఫ్ జోన్‌లో.. దొంగలు

ముద్ర సుబ్బారావు అండ్ గ్యాంగ్‌పై సాధారణ 420 కేసు పెట్టారు. ఆయన పది రోజులు కస్టడీలో ఉండి బయటకు వచ్చేశాడు. ఈ స్కామ్‌లో ప్రధాన పాత్రధారి ముద్ర సుబ్బారావు దర్జాగా ఇపుడు బయట తిరుగుతున్నాడు. మళ్లీ రవాణాశాఖ ఏజంట్‌గా ఇందిరాగాంధీ స్టేడియం కాంప్లెక్స్‌లో పనిచేస్తున్నాడు. రవాణా శాఖ పరంగా సహకారం అందించిన అవినీతి అధికారులలో ఒకరిద్దరిపైనే వేటు పడింది. ఈ వ్యవహారంతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న మిగిలిన వారంతా సేఫ్ జోన్‌లో ఉన్నారు. పెండింగ్ విచారణల పేరుతో విజయవాడకు చెందిన విఠల్ అనే అవినీతి ఉద్యోగి మళ్లీ ఉద్యోగంలో చేరాడు.

కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లకుండా చేసి..

రవాణా వాహనాల డేటాబేస్ పోర్టల్ అయిన కేంద్ర ప్రభుత్వ వాహన్ సైట్ ట్యాంపరింగ్‌కు పాల్పడితే.. ఇంత పెద్ద విషయాన్ని కేంద్ర రవాణా శాఖ దృష్టికి ఏపీ రవాణా శాఖ అధికారులు తీసుకు వెళ్లలేదు. ఈ వ్యవహారంలో వైసీపీ నేతల పాత్ర ఉండటంతో కేంద్రం సీబీఐ విచారణకు ఆదేశిస్తుందేమోనన్న ఉద్దేశంతో గప్‌చుప్‌గా ఉంచారు. దేశంలోనే అతిపెద్ద రవాణా వాహనాల స్కామ్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉంది.



జేసీ గీతాంజలి శర్మ నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ అట్లూరి వెంకటేశ్వరరావు | సహకార శాఖ ఆడిటర్ జె.రమేష్ | ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు | సాంఘిక సంక్షేమ శాఖ జేడి షాహీద్‌బాబు | సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగి ఆర్.ప్రవీణ్ | రాజు | షా నజీర్ | ఎండి మోమిన్, ఎంఈవో ఘంటసాల | ఎం.వి. శ్యామ్‌గౌడ్, సూపరింటెండెంట్ | లంకిశెట్టి హరనాథ్, లెక్చరర్ | డా. రామశేఖరరెడ్డి, ప్రొఫెసర్, కృష్ణా వర్సిటీ | కె.ఎస్. ప్రసాద్, బందరు మునిసిపాలిటీ



అశ్వని, మచిలీపట్నం మునిసిపల్ అధికారి | కె. వెంకటేశ్వరరావు, మునిసిపల్ ఉద్యోగి | దాసరి వెంకట నాగ రవి, లైబ్రేరియన్ | మచిలీపట్నం ఆర్డీవో వాణి | జి.శ్రీదేవి, ఇన్‌ఛార్జి డీఆర్వో | ఎస్వీ నాగేశ్వరనాయక్, పంచాయతీ అధికారి | జి.వి. సూర్యనారాయణ, డ్వామా పీడి | వి.పార్వతి, జిల్లా పౌర సరఫరాల శాఖ | జ్యోతి, ఉద్యానవన శాఖాధికారి | రాజాబాబు, సర్వేయర్ | కోన ఆంజనేయ కుమార్, వీఆర్వో | కె. అనిల్‌కుమార్, డిటి, పెనమలూరు | ఎం.వి.బి. శ్రీనివాసరావు, ఏవో జిల్లా పరిషత్



బసవేశ్వరరావు, మెప్మా | కె.ప్రవీణ్‌కుమార్ బాలసైంటిస్టు | బాలసైంటిస్టు రమణ | రెడ్‌క్రాస్ ప్రతినిధి కొండపల్లి రామ్‌బాలాజీ | రెడ్‌క్రాస్ ప్రతినిధి నరేంద్ర | కృపాకటాక్షం | అంబేద్కర్, డీఈవో కార్యాలయం | బాబూ రాజేంద్రప్రసాద్, వ్యవసాయ శాఖ | కె.కొత్తగూడెం సంక్షేమ కార్యదర్శి పావని | పోలీసు అధికారి | నిమ్మగడ్డ వసంతలక్ష్మి, సెంట్రల్‌డ్రగ్ స్టోర్స్ | యోగా మాస్టర్ చింతయ్య | స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీరామ్



బ్రహ్మేంద్ర చల్లపల్లి రెడ్ క్రాస్ ప్రతినిధి | వెంకటేశ్వరరావు, సీసీ, డీఆర్వో కార్యాలయం | కె.వెంకటేశ్వరరావు, కలెక్టర్ కార్యాలయం | ఎం.రహ్మతుల్లా బేగ్, కలెక్టర్ కార్యాలయం | టి.వి.వి. మోహనరావు దేవదాయ శాఖ



ద్వితీయ బహుమతి పొందిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ శకటం, తృతీయ బహుమతి వ్యవసాయ శాఖ శకటం

529 మందికి ప్రశంసాపత్రాలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లాలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకర్తలు 529 మందికి రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్, జేసీ గీతాంజలి శర్మలు గురువారం అవార్డులు అందజేశారు. మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఎంతో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి రవీంద్ర కార్యక్రమంలో పాల్గొని అవార్డులు అందచేశారు. ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులకు మంత్రి రవీంద్ర రూ. 50 వేల నగదు బహుమతులు అందజేశారు. - మచిలీపట్నం టౌన్

అన్నివర్గాల సమగ్రాభివృద్ధే ధ్యేయం



ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా వేడుకలు : మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం, ఆగస్టు 15 : అన్ని వర్గాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, పేదల సంక్షేమం కోసం విప్లవాత్మక పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించగా, ముఖ్యఅతిథిగా కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 240939 మందికి ఆగస్టు నెలలో రూ.162.49 కోట్లు పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఐదు కొత్త రీచ్‌లు గుర్తించి, 14.55 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నిజమైన రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ఈ-క్రాప్ నమోదును డిజిటల్ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 70 వేల మంది రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటివరకు జిల్లాలో 53563 మందికి ఈ కార్డులు పంపిణీ చేశామని, 5213మంది రైతులకు రూ.21 కోట్ల పంట రుణాలు అందజేసినట్లు మంత్రి వివరించారు. మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగర మాల ఫేజ్-2 కింద రూ.421.17 కోట్ల వ్యయంతో గిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. జిల్లాలో సాగునీటి కాలువలు, డ్రైనేజీల నిర్వహణ కోసం ఈ ఆర్థిక సంవత్సర కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రూ.26.27 కోట్లతో 123 పనులు చేపట్టామని, కాలువ గట్లు పటిష్టపర్చేందుకు 43.33 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించామని మంత్రి తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు అమలు చేస్తామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా సామాన్యుడికి మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.



ఆకట్టుకున్న పోలీసు కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో జరిగిన పోలీసు కవాతు, పలు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మంత్రి పోలీసుల సంక్షేమానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. 8 మంది మత్స్యకార మృతుల కుటుంబాలకు చంద్రన్న బీమా కింద రూ.40 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్ తదితరులతో కలిసి మంత్రి జాతీయ జెండా ఎగురవేసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.

పింగళి నేటి తరానికి స్ఫూర్తి

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 15 : జాతీయ పతాక నిర్మాత కృష్ణాజిల్లా వాసి కావడం ఎంతో గర్వించదగిన విషయమని, పింగళి వెంకయ్యను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం జాతీయ భావాలను పెంపొందించుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మూడు స్తంభాల నుంచి విజయవాడ వెళ్లే రోడ్డులో గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు ఏర్పాటు చేసిన 105 అడుగుల జెండా స్థూపంపై భారీ జాతీయ పతాకను మంత్రి ఆవిష్కరించగా.. పింగళి వెంకయ్య విగ్రహాన్ని కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, బర్మా వెంకయ్యగా పేరు పొందిన పింగళి వెంకయ్య గాంధీజీ పిలుపు మేరకు జాతీయ జెండాను రూపొందించి ఇచ్చారని, ఆయన రూపొందించిన జాతీయ జెండా భారతదేశమంతా రెపరెపలాడుతోందన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, విజయవాడ జాతీయ రహదారిపై అందరికీ కనబడే నిలువెత్తు జెండా స్థూపం, పింగళి వెంకయ్య విగ్రహం దేశభక్తిని ప్రబోధిస్తుందన్నారు. గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జనసేన నేత బండి రామకృష్ణ, బూరగడ్డ వేదవ్యాస్, మోటమర్రి బాబాప్రసాద్, మాదివాడ రాము, పింగళి కుటుంబ సభ్యురాలు సుశీల, ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి రవీంద్ర తదితరులు

ఢిల్లీలో పంద్రాగస్టు వేడుకలకు చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి

» కేంద్ర మంత్రి నుంచి గుర్తింపు, సత్కారం

చల్లపల్లి, ఆగస్టు 15 : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన పంద్రాగస్టు వేడుకలకు చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి హాజరయ్యారు. సుపరిపాలన, పచ్చదనం.. పరిశుభ్రత తదితర అంశాల ప్రాతిపదికగా రాష్ట్ర ప్రభుత్వం కృష్ణకుమారిని ఢిల్లీ వేడుకలకు ఎంపికచేశారు. భర్త పైడిపాముల రాజేంద్రతో కలిసి ఆమె స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. ఢిల్లీ జనపథ్‌లో "పాజిటివ్ ఇంపాక్ట్ ఆఫ్ వుమెన్ లీడర్‌షిప్ ఇన్ పంచాయత్స్" నేషనల్ వర్క్‌షాపులో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతులమీదుగా కృష్ణకుమారిని సన్మానించి జ్ఞాపికను అందించారు. పంచాయతీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధుల్లో కృష్ణకుమారి ఒక్కరే కేంద్ర మంత్రి చేతులమీదుగా సన్మానం అందుకోవటం చల్లపల్లికి మరింత ఖ్యాతిని అందించింది. చల్లపల్లి సర్పంచ్‌కు దక్కిన అరుదైన గౌరవం పట్ల స్వచ్ఛ కార్యకర్తలు సంతోషం వ్యక్తంచేశారు.



కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ నుంచి సత్కారం అందుకుంటున్న చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి

గుడివాడకు ప్రత్యేక ప్రాధాన్యత

» అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవంలో వెనిగండ్ల

గుడివాడ : గుడివాడకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రంలో మొదటిసారి అన్నక్యాంటీన్‌ను చంద్రబాబు పునఃప్రారంభించారని స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం తుమ్మలరాంబ్రహ్మం పార్కులోని అన్నక్యాంటీన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, ప్రజల నమ్మకానికి తగ్గట్టు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజాపాలన చేస్తు.. అయోమయ స్థితిలో ఉన్న రాష్ట్రాన్ని రెండు నెలల్లో చంద్రబాబు గాడిన పెట్టారని అన్నారు.



అన్న క్యాంటీన్ల పునఃప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

అమరావతి, పోలవరం పూర్తి చేస్తాం : బాలశౌరి

రాష్ట్రానికి రెండు కళ్లు అయిన అమరావతి, పోలవరం నిర్మాణం కూటమి ప్రభుత్వ హయాంలో పూర్తి చేస్తామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల మొదటి తేదీన పింఛన్ ఇంటికి అందిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్‌లను రెండు నెలల వ్యవధిలో పునఃప్రారంభించారన్నారు. జలజీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయించి నీటి సమస్యను పరిష్కరించాలని బాలశౌరి చంద్రబాబును కోరారు. సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమారరాజా, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు భారీ విరాళాలిచ్చిన శ్రీనివాసరాజు, నారా భువనేశ్వరీలు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ నిర్వహణకు దాతల విరాళాలు

గుడివాడలో అన్నక్యాంటీన్ నిర్వహణకు పలువురు దాతలు విరాళాలు అందించారు. వీరిలో మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని పార్లమెంట్ సభ్యులు, ఏడుగురు ఎమ్మెల్యేలు కలిపి రూ.50లక్షలు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, ప్రసాద్ దంపతులు రూ.1లక్ష, పామర్రు మండలం పెద్దమద్దాలికి చెందిన సుంకర మల్లిఖార్జునరావు రూ.50వేలు, జమీగొల్వేపల్లికి చెందిన ఐనంపూడి వెంకట సీతా మనోహర్‌రావు రూ.25వేలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు.

చంద్రబాబు పర్యటన సాగిందిలా..


అన్నక్యాంటీన్ పునఃప్రారంభం సందర్భంగా గుడివాడకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం 12.50గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. మంత్రికొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, శాసనసభ్యులు వెనిగండ్ల రాము, మండలి బుద్ధప్రసాద్, వర్లకుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావ్, బోడేప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు చంద్రబాబుకు స్వాగతం పలికారు. అక్కడి నుండి గుడివాడ పురపాలకసంఘంలోని తుమ్మల రామబ్రహ్మం పార్కులో ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్‌ను ప్రారంభించారు. స్వయంగా రూ.5లు చెల్లించి భోజనం చేశారు. భోజనం చేస్తున్న లబ్దిదారులతో మాట్లాడారు. హరేకృష్ణ మూమెంట్ సంస్థ(అక్షయపాత్ర) ప్రతినిధులతో ముచ్చటించారు. అన్నక్యాంటీన్‌లో అందించే మెనూచార్టును పరిశీలించారు. అనంతరం పలురంగాలకు చెందిన పేదలతో మాట్లాడి. వారి కష్టాలు, అనుభవాలను తెలుసుకుని వారిని ఏవిధంగా ఆదుకోవాలనే విషయంపై మాట్లాడారు. అన్నక్యాంటీన్‌లకు రూ.1కోటి చొప్పున విరాళాలిచ్చిన దాతలు శ్రీనివాసరాజు, నారా భువనేశ్వరిలను ఘనంగా సత్కరించారు. తిరిగి 2.25కి హెలీకాఫ్టర్‌లో ఉండవల్లిలోని సీఎం నివాసానికి తిరుగు ప్రయాణమయ్యారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మహనీయుల త్యాగాల స్ఫూర్తిగా జిల్లా బంగారు భవిత నిర్మాణానికి కృషి చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. జిల్లా ప్రగతికి ఐక్యతతో సమిష్టిగా పనిచేసి సత్ఫలితాలు సాధిద్దామని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లో సమున్నతంగా నిలిపి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేద్దామన్నారు. భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జేసీ నిధి మీనాతో కలిసి కలెక్టర్ సృజన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిల్లలకు మొక్కలు, చాక్లెట్లు పంచారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో వేడుకలలో జేసీ నిధి మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీసీపీ టి.హరిక్రిష్ణ, ఆర్డీవో భవానీ శంకర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని, జాతీయ పతాక ఔన్నత్యాన్ని, విలువలను భావితరాలకు అందించాలన్న లక్ష్యంతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం విజయవంతం చేయటం పట్ల అభినందనలు తెలిపారు. దేశ ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. ఆ స్వేచ్ఛా ఫలాలను అనుభవించడంతో పాటు విధులు, బాధ్యతల విషయంలో నిబద్ధతతో వ్యవహరిస్తూ రాష్ట్రంలోనే కీలకమైన ఎన్టీఆర్ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను జోడెడ్లుగా సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు.





జగ్గయ్యపేట పట్టణం 31వ వార్డు విష్ణుప్రియనగర్‌లో 151 అడుగుల జాతీయ పతకానికి సెల్యూట్ చేస్తున్న నెట్టెం, తాతయ్య, రాఘవేంద్ర, మునిసిపల్ కౌన్సిలర్లు

అన్న క్యాంటీన్‌కు రూ.5లక్షల చెక్కు

సీఎం చంద్రబాబుకు అందజేత

ఉయ్యూరు, ఆగస్టు 15 : అన్నక్యాంటీన్‌కు తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి రూ. 5లక్షల 7వేల, 779 చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు గురువారం అందజేశారు. గుడివాడలో అన్న క్యాంటిన్ ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్య మంత్రిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో కలసి చెక్కు అందజేశారు. కొద్ది రోజుల క్రితం పెన మలూరు నియోజకవర్గం ఉయ్యూరులో మొబైల్ అన్న క్యాంటిన్ ఏర్పాటుచేసి పేదవా రి ఆకలి తీర్చానని, అదిచూసి ఓర్వలేని వైసీపీ నాయకులు అనేక అడ్డంకులు సృష్టించారని ఈసందర్భంగా ముఖ్యమంత్రికి చౌదరి వివరించారు. తెలుగుయువత అధ్యక్షు నిగా పార్టీకి, ప్రజలకు చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి అభినందించి, భవిష్యత్తులో మరిన్ని సేవలందించాలని ఆశీర్వదించి, అభినందించినట్టు చౌదరి తెలిపారు.



ముఖ్య మంత్రి చంద్రబాబుకు అన్న క్యాంటిన్ నిమిత్తం చెక్కు అందజేస్తున్న తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	98, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.86

లక్ష్మీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 15: హనుమాన్‌జంక్షన్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామికి ప్రత్యేక వ్రత పూజలు చేశారు. అర్చకుడు సీతారామాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్, ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామూహిక సీమంతాలు

ఉయ్యూరు, ఆగస్టు 15: కల్కి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో 13 మంది గర్భిణులకు గురువారం సామూహిక సీమంతం నిర్వహించారు. శ్రీభగవతి జన్మదినాన్ని పురస్కరించుకుని గర్భిణులకు పసుపు కుంకుమ, చీర, సారె, పండ్లు, పూలు అందజేశారు. అన్నసమారాధన చేశారు. సమితి బాధ్యుడు శర్మ పాల్గొన్నారు.


సనత్‌నగర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్


ఎనికేపాడు హ్యాపీ చిల్డ్రన్స్ రిహాబిలేషన్ సెంటర్‌లో దివ్యాంగుడితో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


ఉయ్యూరులో ఆర్డీవో కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ఆర్డీవో రాజు


ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద వేడుకలో పాల్గొన్న న్యాయాధికారి కె. శ్రీహరి



హనుమాన్‌జంక్షన్‌లో తిరంగా ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ మాగంటి బాబు

మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

వాడవాడలా స్వాతంత్ర్య దిన వేడుకలు ● రెపరెపలాడిన త్రివర్ణ పతాకాలు

వాడవాడలా 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల్లో వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాలు ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

గుణదల, ఆగస్టు 15: స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగఫలంతోనే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో హ్యాపీ చిల్డ్రన్స్ డవలప్మెంట్ అండ్ రిహాబిలేషన్ సెంటర్‌లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఎగురవేశారు. నిర్వాహకురాలు త్రిపురనేని గాయత్రీదేవి, మాజీ సర్పంచ్ కోనేరు పెదబాబు, చాగంటిపాటి కృష్ణ, గూడవల్లి నరసయ్య, కొమరవల్లి కిషోర్, వెల్లంకి శరత్, కోనేరు సందీప్, పొదిలి శ్రీను, రాజేంద్ర ప్రసాద్, చెల్లుబోయిన వెంకట్రావు, కోనేరు వెంకటనారాయణ పాల్గొన్నారు. కరెన్సీనగర్‌లోని శ్రీచైతన్య పబ్లిక్ స్కూల్ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పొట్లూరి సునీత, ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ నరేంద్ర పాల్గొన్నారు. ప్రసాదంపాడులో దేవి ప్లాజావాసులు అపార్టుమెంట్ వద్ద జాతీయ జెండాను ఎగురవేసి, వేడుకలు జరిపారు.

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహించిన తిరంగా ర్యాలీలో బాపులపాడు హైస్కూల్ విద్యార్థులతో పాటు టీడీపీనేత, మాజీ ఎంపీ మాగంటి బాబు పాల్గొన్నారు. హనుమాన్‌జంక్షన్ సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ సత్యనారాయణ జెండా ఎగురవేసి గౌరవవందనం చేశారు. టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయికల్యాణి, అట్లూరి శ్రీనివాస్ జెండా వందనం చేశారు. వీరవల్లి కూడలిలో నిర్వహించిన వేడుకల్లో లంక సురేంద్ర మోహనబెనర్జీ, సర్పంచ్ పిల్లా అనిత, ఉపసర్పంచ్ లంక అజయ్, మండాది రవీంద్ర, గుండపనేని ఉమావరప్రసాద్ పాల్గొన్నారు. ఆరుగొలను సేక్రెడ్ హార్ట్ స్కూల్‌లో మూల్పూరి వెంకటరత్నం, దయాల రాజేశ్వరరావు, గండేపూడి నితీష్‌కుమార్ జెండా వందనం చేశారు. కాకులపాడు స్కూల్‌లో వీరపనేని రాజా, టీడీపీ నేతలు విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. వేలేరు హైస్కూల్ హెచ్ఎం విజయ్ ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో సేవలందించిన డాక్టర్ యనమదల అశోక్‌చౌదరిని ఘనంగా సత్కరించారు. గ్రామ ప్రముఖులు వేములపల్లి శ్రీనివాసరావు, భవానీశంకర్ పాల్గొన్నారు.

అంబాపురంలో..

విజయవాడ రూరల్: అంబాపురం నేతాజీ సుభాష్ చంద్రబోస్ బొమ్మ సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి చిన్నరామారావు నివాళులర్పించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. సత్యనారాయణ, చల్లగాలి సునీల్, కేశవ, శ్యామ్, శివయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో డి.రాజు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టువద్ద న్యాయాధికారి కె.శ్రీహరి జాతీయ పతాకం ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంకే ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆర్డీవో సుబ్బారావు, ఫాతిమా జాతీయ పతాకం ఎగురవేశారు. నగరపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద, ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వీరమ్మ ఆలయ ప్రాంగణం వద్ద బోడె ప్రసాద్ జాతీయ జెండా ఎగురవేశారు. 5వ వార్డు, రేషన్ డీలర్ల అసోసియేషన్, భవన నిర్మాణ కార్మికుల యూనియన్, ఆటోనగర్ యూనియన్ల ఆధ్వర్యంలో వేర్వేరు చోట్ల నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

కంకిపాడు మండలంలో..

కంకిపాడు: ఈడుపుగల్లులో స్వాతంత్య దినోత్సవ వేడుకల్లో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, టీడీపీ నాయకులు షేక్ షకార్, పందిపాటి సుధాకర్, అనుమోలు రామకృష్ణ, సుంకర సుగుణ, ఘైనేని దుర్గాభవాని, షేక్ బాజీబీ, షేక్ నాగూర్‌బీ, బండారు ప్రవీణ పాల్గొన్నారు. కంకిపాడులో నిర్వహించిన వేడుకలో టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో భాస్కర్, ఈవోఆర్డీ మైథిలి పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో కంకిపాడు సెంటర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. బోయిన నాగరాజు, సుంకర శివ, పచ్చిపాల శేఖర్, కుంటా గంగాధర్, సుంకర సురేష్ పాల్గొన్నారు.

పెనమలూరులో..

సనత్‌నగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం, నగదు ప్రోత్సాహకాలు అందజేత

ఉయ్యూరు: ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల విద్యార్థులకు రూ.35వేలు విలువైన వెయ్యి నోట్‌బుక్స్, 9మందికి రూ.50వేలు ప్రోత్సాహకం, 80 మందికి రూ.40వేలు విలువైన యూనిఫాం మొత్తం రూ.125,000 అందజేశారు. సిద్ధార్థ అకాడమీ కన్వీనర్ టి.శ్రీహరి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు, బాపిరాజు, గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, మేడిశెట్టి మస్తాన్, వూర కిషోర్, డిగ్రీ కళాశాల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శివనాథ్, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.


గన్నవరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ..


టీడీపీ బాపులపాడు మండల కార్యాలయంలో..


కంకిపాడు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ..

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. పింఛన్ల పంపిణీలో ఉత్తమ పనితీరు కనబరిచిన సచివాలయ సిబ్బందికి సూపరింటెండెంట్ బసవయ్యతో కలిసి ఎంపీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జె.విమలకుమారి త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. డీటీ శ్రీలత, ఇన్‌చార్జి ఆర్ఐ షఫీకుమార్, వీఆర్వోలు, వీఆర్యేలు పాల్గొన్నారు. ఉంగుటూరు, ఆత్కూరు పీఎస్‌లలో ఎస్సైలు వి.రవిచంద్రకుమార్, సీహెచ్ సురేష్‌లు జాతీయజెండాను ఎగురవేశారు. మండలంలోని పాఠశాలల్లో వేడుకల్లో ఎంఈవో-2 జె.సాంబశివరావు, ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇందుపల్లి హైస్కూల్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఉంగుటూరు: ఇందుపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ మండలాధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, దాతలు ప్రోత్సాహకంగా అందించిన రూ.72వేలను అందజేశారు. ఎంఈవో-2 జె.సాంబశివరావుతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, కార్యదర్శి కోటేశ్వరరావు, హెచ్ఎం సీతారాం పాల్గొన్నారు.

గన్నవరంలో..

గన్నవరం: మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, గ్రేడ్-1 గ్రంథాలయంలో చిమట రామారావు, దొండపాటి బాబూరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

సేవకు పురస్కారం

ఉయ్యూరు, ఆగస్టు 15: మచిలీపట్నంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ నుంచి ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డి.కృష్ణనాయక్ ప్రశంసాపత్రం అందుకున్నారు. కృష్ణనాయక్‌కు పలువురు అభినందనలు తెలిపారు.


జేసీ గీతాంజలి శర్మ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్, గన్నవరం ఎంపీడీవో సత్యకుమార్

గన్నవరం: మచిలీపట్నంలో జేసీ గీతాంజలిశర్మ నుంచి ఉత్తమ ఎంపీడీవోగా ఇ.సత్యకుమార్ అవార్డును అందుకున్నారు. పీడీఎస్ డీటీ నండూరి ప్రధాన్, ఎస్డీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ హరీష్, సూరంపల్లి పంచాయతీ కార్యదర్శి కోటా సురేష్‌బాబు. కేసరపల్లి అంగన్వాడీ టీచర్ స్వప్నలకు అవార్డు వచ్చింది.

నున్న పంచాయతీ కార్యదర్శికి పురస్కారం

విజయవాడ రూరల్: నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన నుంచి నున్న పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. పలువురు అధికారులు, సిబ్బంది జీటీవీ రమణకు శుభాకాంక్షలు తెలిపారు.


కలెక్టర్ సృజన నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న నున్న పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ

గన్నవరం సీఐగా బీవీ శివప్రసాద్


గన్నవరం సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న బీవీ శివప్రసాద్

గన్నవరం, ఆగస్టు 15: గన్నవరం సీఐగా బీవీ శివప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీబీ మెయిన్ కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి విచ్చేశారు. గన్నవరంలో పనిచేసే కేవీఎస్‌వీ ప్రసాద్‌ను ఏలూరు రేంజ్ వీఆర్‌కు పంపారు. శాంతి భద్రతలను కాపాడటమే లక్ష్యంగా పని చేస్తానని శివ ప్రసాద్ తెలిపారు. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వారికి దిశానిర్దేశం చేశారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

కంకిపాడు, ఆగస్టు 15: వరి పొలంలో నీటిని తొలగించేందుకు మోటార్ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఎలక్ట్రీషియన్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పునాదిపాడులో గురువారం జరిగింది. పునాదిపాడుకు చెందిన ఓ రైతు పొలంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో మానికొండకు చెందిన ఎలక్ట్రీషియన్ మల్లికార్జునరావును మోటార్ ద్వారా నీరు తొలగించేందుకు పిలిపించాడు. మోటార్‌తో నీళ్లు తరలించే క్రమంలో మల్లికార్జునరావుకు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడిక్కడే మృతిచెందాడు. కంకిపాడు పోలీసులు మల్లికార్జునరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న పాలవ్యాన్..యువకుడి దుర్మరణం

ఉయ్యూరు, ఆగస్టు 15: ఉయ్యూరు-కాటూరు రోడ్డులో బుధవారం రాత్రి బైక్‌ను ఎదురుగా వస్తున్న పాలవ్యాన్ ఢీకొని తోట్లవల్లూరుకు చెందిన డెక్కమడుగు అంబేడ్కర్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. ఉయ్యూరు పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అంబేడ్కర్ ద్విచక్రవాహనంపై కడవకొల్లులోని తన సోదరి నివాసానికి వెళుతుండగా మార్కెట్ యార్డు దాటిన తరువాత ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట బోదెలో వృద్ధుడి మృతదేహం

ఉయ్యూరు: గండిగుంట పంచాయతీ పరిధి కాటూరు రోడ్డు పల్లవి అపార్ట్‌మెంట్‌లో నివసించే చాపల వీరరాఘవయ్య(73) పంటబోదెలో పడి అనుమానస్పదంగా మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఇంట్లో ఒంటరిగా నివసించే వీరరాఘవయ్య మంగళవారం మధ్యాహ్నం సెల్‌ఫోన్ వదలిపెట్టి కన్పించకుండా వెళ్లిపోయాడు. గండిగుంటలో ఉండే అతని కుమారుడు మహేశ్వరరావు సాయంత్రం అపార్ట్‌మెంట్‌కు వస్తే తండ్రి లేకపోవడంతో ఆయన కోసం వెదికాడు. గురువారం మార్కెట్ యార్డు సమీపంలోని పంటబోదెలో మృతదేహం కన్పించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మహేశ్వరరావుకు సమాచారమిచ్చారు. అక్కడకు వెళ్లిన ఆయన ఆ మృతదేహం వీరరాఘవయ్యదిగా గుర్తించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎరువుల దుకాణంలో చోరీ

ఉంగుటూరు, ఆగస్టు 15: ఉంగుటూరులో మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలో భద్రపరచిన రూ.48 వేల రూపాయలు దోచుకుని వెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుకాణంలో ముగ్గురు సిబ్బంది పనిచేస్తుంటారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు షాపును మూసివేసి వారు ఇళ్లకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున 6 గంటల సమయంలో అటుగా వెళ్తున్న ఏఎస్సై అబ్దుల్ సత్తార్ దుకాణం షట్టర్ కొంత తెరచి ఉండడాన్ని గమనించారు. వెంటనే దుకాణం సిబ్బందికి ఫోన్లో సమాచారమందించారు. గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు సిబ్బంది గుర్తించారు. చోరీ ఘటనపై స్థానిక ఎస్సై వి.రవిచంద్రకుమార్‌కు ఫిర్యాదుచేశారు. సంఘటనాస్థలాన్ని ఎస్సై పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఎరువుల స్టాక్‌ను పరిశీలించి, బీరువాలో దాచి ఉంచిన రూ.48వేలు చోరీ అయినట్టు గుర్తించారు. షాపు బయట కరెంట్ మీటరుకున్న ఫ్యూజ్‌ను తొలగించి, షట్టర్ తాళాలు పగులకొట్టి దొంగతనానికి పాల్పడినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 15: విద్యార్థులకు మౌలికసదుపాయాల కల్పనకు దాతలందిస్తున్న సహకారం అభినందనీయమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సర్పంచ్ కట్టుబోయిన నాగమణి సూచించారు. మల్లవల్లి ఎంపీపీ స్కూల్‌కు గొరిపర్తి వంశీకృష్ణ అందజేసిన రూ.30వేల విలువైన బెంచీలను గురువారం ఆమె ప్రారంభించారు. ఎంపీటీసీ వెంకటనారాయణ, షేక్ రఫీ, హెచ్ఎం శిరీషాదేవి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.


రంగన్నగూడెంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలను సత్కరిస్తున్న కసుకుర్తి రంగామణి, ఆళ్ల గోపాలకృష్ణ, పుసులూరి లక్ష్మీనారాయణ

గ్రామ పెద్దలు, పారిశుధ్య కార్మికులకు సత్కారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రంగన్నగూడెంలో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి ఆధ్వర్యంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలను సత్కరించారు. ఆళ్ల గోపాలకృష్ణ, మొవ్వా వేణుగోపాల్, శ్రీనివాసరావు, బెజవాడ వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

●బొమ్ములూరులో పారిశుధ్య కార్మికులు సబ్బా వెంకటేశ్వరరావు, సిలారపు యేసును టీడీపీ గ్రామకమిటీ అధ్యర్యంలో సత్కరించారు. సర్పంచ్ కాటూరు విజయభాస్కర్, వేగే కృష్ణారావు, కార్యదర్శి గుళ్లపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటల పోటీల విజేతలకు బహుమతులు

వేలేరులోని అమ్మ(అనాథ శరణాలయం)ఆవాసీయ విద్యాలయంలో వార్డెన్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆటలపోటీల్లో విజేతలైన విద్యార్థులకు స్థలదాత అవిర్నేని రాధాకృష్ణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర బోస్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేములపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో రాంబాలాసింగ్ బహుమతులు అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ మరియమ్మ, భవానీశంకర్, కాజా సురేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలి


నందమూరు వెల్‌నెస్‌సెంటర్‌కు ఫ్రిడ్జ్ బహూకరిస్తున్న అనగాని సురేష్

ఉంగుటూరు, ఆగస్టు 15: వరిలో కలుపు తీస్తున్నప్పుడు కూలీలు పాముకాటు బారినపడి చనిపోతున్నారని, మండలంలోని అన్ని పీహెచ్‌సీల్లో పాము, కుక్కకాటు చికిత్సకు యాంటీ స్నేక్ వీనమ్, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను అనగాని చారిటబుల్ ట్రస్ట్(నందమూరు)అధినేత, టీడీపీ యువనాయకుడు అనగాని సురేష్ కోరారు. ఇటీవల నందమూరులో పాముకాటుతో ఒకరు మరణించడంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. రూ.30వేలరూపాయల విలువైన ఫ్రిడ్జ్‌ను హెల్త్‌వెల్‌నెస్ సెంటరుకు గురువారం ఆయన బహూకరించారు. ఇందుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీవీ సుబ్బారావుతో మాట్లాడి 4 వైల్స్ పాముకాటు వ్యాక్సిన్లు, 15డోసుల కుక్కకాటు వ్యాక్సిన్లు తెప్పించి, ఫ్రిడ్జ్‌లో స్టోర్ చేయించారు. సర్పంచ్ తులిమిల్లి బేబి, ఎంపీటీసీ సభ్యుడు టీవీడీఎన్ ప్రసాద్, ఇందుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్బారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


చదువులో ప్రతిభకనబరిచిన విద్యార్థికి మెమెంటో, నగదు బహుమతి అందిస్తున్న ఎంఈవో, పూర్వవిద్యార్థులు

ఉంగుటూరు, ఆగస్టు 15: వెల్దిపాడు జడ్పీ హైస్కూల్‌లో 1982-83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం గురువారం సందడిగా జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఈవో-2 జె.సాంబశివరావు, పాఠశాల హెచ్ఎం జేకే దుర్గాప్రసాద్‌ను సత్కరించి, వారితో పదో తరగతిలో అత్యధికమార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2 వేలు చొప్పున నగదు, మెమెంటోలు అందజేయించారు. సర్పంచ్ లాం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ-2 కె.చంద్రశేఖరరావు, పూర్వ విద్యార్థులు టీవీ లక్ష్మణస్వామి, పీవీ మల్లేశ్వరరావు, రాంబాబు, పీకే సాంబశివరావు, లక్ష్మీకుమారి, పద్మ, సంధ్యారాణి, వాణి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	98, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.86

మోపిదేవిలో 400 అడుగుల జాతీయ పతాకం ర్యాలీ



మోపిదేవి : విద్యార్థులు జాతీయ భావాలు పెంపొందించుకుని దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. మోపిదేవిలో 400 అడుగుల జాతీయ జెండాతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ నడకుదుటి జననీ కుమారి, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, కొమ్ము పవన్ కుమార్, రావి నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, రామలింగేశ్వరరావు, జనార్ధనరావు, రావి రత్నగిరి, బాలకోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు జయంతి పాల్గొన్నారు.



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల



గుడివాడలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వెనిగండ్ల



అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



పతాకావిష్కరణ చేస్తున్న కాగిత



పామర్రులో ప్రోత్సాహకాలు అందిస్తున్న కుమార్ రాజా

మదినిండా దేశభక్తి...ముువ్వన్నెల జెండా రెపరెపలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 15 : జిల్లా కేంద్రం మచిలీపట్నంతో పాటు వాడవాడలా 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది. కోనేరు సెంటర్‌లో, టీడీపీ కార్యాలయం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర జాతీయ జెండా ఎగురవేశారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడు తోట నరసయ్య విగ్రహాన్ని నెలకొల్పుతామని, భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనాన్ని నిర్మించి తీరుతామని అన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎండి ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఆర్. శ్రీనివాసరావు, ముడా కార్యాలయం వద్ద వీసీ వెంకట రమణ, యూనియన్ బ్యాంకు వద్ద ఆర్ఎం ఆర్.వెంకట్రావు జాతీయ జెండా ఎగురవేశారు. కానూరులో తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, చిన్నాపురంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు సాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. **పెడన** : బస్టాండ్ సెంటర్‌లో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అబ్దుల్ ఖయూం, యక్కల శ్యామలయ్య, వహాబ్‌ఖాన్, అనుముల పూర్ణ, కమ్మగంటి బాబు, బెజవాడ నాగరాజు, వీణం శ్రీనివాస్, పోతార్లంక నాని పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ కటకం నాగకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విశ్వభారతి హైస్కూల్ విద్యార్థినులు దేశభక్తి గీతాలు అలరించాయి. వాసవీ ప్రార్థనా మందిరంలో ఆర్యవైశ్య సంఘ నేత కొల్లూరి చిన్నా, కళాంజలి హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ కె.దిలీప్ జాతీపతాకాలను ఆవిష్కరించారు. **పెడన రూరల్** : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రాజులపాటి వాణి జాతీయ జెండా ఎగురవేసి, ఉత్తమసేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఎంపీడీవో రెడ్డయ్య, అచ్యుతరావు, పాల్గొన్నారు. నందమూరు, నడుపూరు, మడక, బల్లిపర్రు, పెనుమల్లి, ఎస్వీ పల్లి, ఉరివి, చెన్నూరు, గురివిందగుంట, కమలాపురం, నందిగామ, కొంకేపూడి పంచాయతీలలో సర్పంచులు పంచకర్ల సురేష్, బొడ్డు చినబాబు, గుడిసేవ శ్రీనివాసరావు, దావు భైరవలింగం, శీర్ల అనూష, జాతీయ జండా ఎగురవేశారు. నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో కరస్పాండెంట్ కాకి కుమార్ బాబు జెండా ఆష్కరించారు. యువజన గ్రంథాల యం వద్ద దక్షిణ భారత హిందీ ప్రచార సభ (చెన్నై) రిటైర్డ్ మేనేజర్ కొసనం నాగేశ్వరరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలవరం, కప్పలదొడ్డి గ్రామాల్లోని పాఠశాలల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కె.మధుసూదనరావు నగదు బహుమతులు, సైకిళ్లు అందజేశారు. **బంటుమిల్లి** : నాగేశ్వరరావుపేట, మల్లేశ్వరం మార్కెట్‌యార్డు వద్ద జాతీయజెండాను ఎమ్మె ల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆవిష్కరించారు. . తహసీల్దార్ భరత్‌రెడ్డి, ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు పతాకాలను ఆవిష్కరించారు. మణిమేశ్వరంలో మాజీ సైనికుడు కోసూరు సత్యనారాయణరాజును ఘనంగా సన్మానించారు. **గుడివాడ** : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్డీవో పి.పద్మావతి, అదనపు జిల్లా న్యాయమూర్తి జి. సుబ్రహ్మణ్యం, విశ్వభారతి పాఠశాలలో చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డా.కెకెఆర్స్ గౌతమ్ పాఠశాలలో ప్రముఖులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎస్‌పిఎస్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జాతీయ జెండాను ఆవిష్కరించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. **గుడివాడ రూరల్** : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గద్దె పుష్పరాణి జాతీయ జెండాను ఎగురవేశారు. జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీకాంత్ పాల్గొన్నారు. **నందివాడ** : తహసీల్దార్ రామానాయక్, ఇన్‌చార్జి ఎంపీడీవో కోటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు, ఎంపీపీ ఆదాం జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. **గుడ్లవల్లేరు** : మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సేవలందించిన ఉద్యోగులను సత్కరించారు. పంచాయతీ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్, మాజీ సైనికులను సన్మానించారు. ఎ.ఎ.ఎస్.ఎం అండ్ వి.వి. ఆర్.ఎస్.ఆర్ హైస్కూల్‌లో జాతీయ జెండాను ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజరు బత్తిన రమణ జాతీయ జెండా ఆవిష్కరించారు. నృత్య ప్రదర్శన లు అలరించాయి. లయన్స్ క్లబ్ లో అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాలిటెక్నిక్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. **అవనిగడ్డ** : గాంధీక్షేత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కోర్టు సముదాయాల వద్ద సీనియర్ న్యాయాధికారి బాబూ నాయక్, జూనియర్ న్యాయాధికారి ఎల్.గోపినాథ్ జాతీయ జెండా ఎగురవేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ్, న్యాయవాదులు పాల్గొన్నారు. బాబూ నాయక్ రిమాండ్ ఖైదీలకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టి సత్ప్రవర్తనతో మెగాలని సూచించారు. డీఎస్పీ మురళీధర్, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, తహసీల్దార్ మురళీధర్ జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, గుడివాక శశేషుబాబు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : అశ్వారావుపాలెం పాఠశాల వద్ద సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ తుంగల సుమతి దేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పెన్షన్లు వేగవంతంగా పంపిణీ చేసిన ఆర్.శ్రావణిని అభినందించారు. రామచంద్రపురం పంచాయతీ కార్యాలయం. సర్పంచ్ వాకా రమేష్, కార్యదర్శి బండే శేషగిరిరావు, మోదుమూడిలో సర్పంచ్ బచ్చు బేబీ, పులిగడ్డలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ జెండా ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. **మోపిదేవి** : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ నడకుదుటి జననీకుమారి, తహసీల్దార్ ఎస్.శ్రీవిద్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన వేడుకల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పతాక ఆవిష్కరణ గావించారు. కొక్కిలిగడ్డలో సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, పెదకళ్లేపల్లిలో అరజా సంధ్యారాణి, బొబ్బర్లంకలో దొప్పలపూడి గంగాభవాని, కె.కొత్తపాలెంలో కొక్కిలిగడ్డ మాధవి, పెదప్రోలులో పోలిమేట్ల ఏసుబాబు పతాకాన్ని ఆవిష్కరించారు. కప్తానుపాలెం ప్రాథమిక పాఠశాలలో డొకిపర్తి బాలకోటేశ్వరరావు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. **ఘంటసాల** : తహసీల్దార్ బి.విజయప్రసాద్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. డీటీ చిట్టిబాబు, రీ సర్వే డీటీ శ్రీనివాస్, వీఆర్వోలు, వీఆర్ఏలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు. మండల పరషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ వేమూరి రజని కుమారి జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కెజె.శ్రీనివాస చందు, వైస్ ఎంపీపీ నాగేంద్రబాబు, వేమూరి ప్రవీణ్ పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ప్రతాప్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు వేడుకల్లో పాల్గొన్నారు. **నాగాయలంక** : రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్ నేతృత్వంలో స్కాలర్స్ స్కూల్ వద్ద నుంచి తిరంగా జెండా ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో జెండా వందనం, జాతీయ గీతాలాపన జరిగాయి. మండలి వెంకట్రామ్, తహసీల్దార్ ఎం.హరనాథబాబు, వీఆర్వోలు, పోలీసులు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. **కూచిపూడి** : సిద్దేంద్ర కళాపీఠంలో వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ, నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ జాతీయ జెండా ఎగురవేశారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేసి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పిట్టు శ్రీనివాసరావు, పాగోలు రమేష్ బాబు, మోహన కుమార్ పాల్గొన్నారు. చినముత్తేవిలో సర్పంచ్ కొమ్ము సౌధామణి, ఆవిరిపూడిలో సర్పంచ్ ఏనుగ ఝాన్సీలక్ష్మి వేడుకలు ఘనంగా జరిగాయి. కోసూరులో తిరంగా రన్ నిర్వహించారు. **పెదపారుపూడి** : మం డల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ గోగం సురేష్ పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగురవేశారు. వెంట్రప్రగడ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి నివాళులర్పించారు. బోసు బొమ్మ సెంటర్‌లో వింగ్ కమాండర్ కాట్రగడ్డ నాగేశ్వరరావు సుభాష్ చం ద్రబోస్ విగ్రహానికి నివాళులర్పించారు. వానపాముల హైస్కూల్‌లో రాఘవేంద్రరావు అధ్యక్షతన అట్లూరి రామబ్రహ్మం, ముక్కామల వేణుగోపాలరావులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు దాతలు అట్లూరి రామబ్రహ్మం, అట్లూరి నారాయణరావు ఇచ్చిన నగదు బహుమతులను, కొల్లి చుక్కమ్మ - పాలడుగు సోమయ్య జ్ఞాపకార్థం ఇచ్చిన నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ భాను ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. **తోట్లవల్లూరు** : పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెనుముత్స రాధిక, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్ధార్ కార్యాలయంలో తహసీల్ధార్ ఎం కుసుమకుమారి పతాకాలను ఎగురవేశారు. చాగంటిపాడు దళితవాడ పాఠశాలలో వీరపనేని శివరామ్‌ప్రసాద్ చేతు ల మీదుగా టీడీపీ నాయకుడు మట్టా అమృతబాబు నోట్ పుస్తకాలు, విజేతలకు బహుమతులు అందించారు. పెనమకూరు హైస్కూల్లో మాజీ సర్పంచ్ సూరపనేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తలశిల శ్రీనివాసప్రసాద్ మ్యాట్‌ను బహూకరించారు. సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ మరీదు మధుబాబు పాల్గొన్నారు. యాకమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చొప్పరపు సుబ్రహ్మణ్యం నోట్ పుస్తకాలను సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల వెంకట సాంబశివరావు, సర్పంచ్ గాదె కనకదుర్గ అందజేశారు. రొయ్యూరులో టీడీపీ నాయకుడు సూరి పవన్‌కుమార్ జామెంట్రీ బాక్సులు, నోట్ పుస్తకాలను లుక్కా రేణుకారావు, ఉప్పులూరి గోపాలకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. **పామర్రు** : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వల్లూరుపల్లి చక్రవర్తి,హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఇందిరారాణి పాల్గొన్నారు. రైతుబజారు, కనుమూరు ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటారు. తహసీల్దార్ జి.రవికాంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీపీ దాసరిఅశోక్ కుమార్, ఏవో శివనాగరాణి, సీఐ, ఎస్సైలు శుభాకర్, అవినాష్, జెండా ఎగురవేశారు. కనుమూరు, అడ్డాడ, జమీదగ్గుమిల్లి, పసుమర్రు, నిమ్మకూరు గ్రామాల్లోని ప్రభుత్వ హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు జెండా ఆవిష్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు బొగ్గరపు జాలయ్య, వాసవీ వనితా క్లబ్ అధ్యక్షుడు ఘంటసాలసాయిరామ్ జెండా ఎగురవేశారు. ఏఎస్ఎం హైస్కూల్స్‌లో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి, అస్సై స్సీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపాల్ సిస్టర్, అరవింద స్కూలులో కరస్పాండెంట్ నాగార్జున జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. **కోడూరు** : పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై శిరీష, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జనసేన పార్టీ కార్యాలయం వద్ద మర్రే గంగయ్య, స్వతంత్రపురం జడ్పీ పాఠశాల వద్ద హెచ్ఎం ఆల వెంకటరమణ, మెరైన్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంఈవో టి.వి.ఎం.రామదాసు, విశ్వనాథపల్లి శ్రీనివాసరావు, ఎన్‌డిఏ నేతలు ఉల్లి శేషగిరిరావు, కొండవీటి సునీత, పూతబోయిన శ్రీనివాసరావు, కోట రాంబాబు, వేములపల్లి రాజేష్, బచ్చు వెంకటేష్, ముద్దినేని చంద్రరావు, జరుగుపోతురాజు, కాగిత రామారావు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీపీ విజయ రాధిక, సీఐ సిహెచ్. నాగప్రసాద్ జాతీయజెండాను ఎగరవేశారు. చల్లపల్లి పంచాయతీలో ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, లక్ష్మీపురం, మంగళాపురం పంచాయతీల్లో సర్పంచ్‌లు కొల్లూరు కోటేశ్వరరావు, డొక్కు నాగేశ్వ రరావు, ఆర్యవైశ్య సంఘ భవనంలో అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు, విజయా అకాడమీలో కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ జాతీయ జెండా ఎగరవేశారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. యువనేత మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని పారిశుధ్య కార్మికులను సన్మానించి నూతన వస్త్రాలను బహూకరించారు. ఆకుల స్వభూ ప్రసాద్, జి.వి.తాతారావు, షేక్ నసీం ఫోరి, వేమూరి గోవర్ధన్, నేతలు సూదాని నంద గోపాల్, ఉరిమి మణికాంత్, మల్లంపల్లి నాంచారయ్య, మిరియాల జితేంద్ర, తోట కనకదుర్గ, గోళ్ల ప్రసాద్, సోమిశెట్టి రాఘవేంద్రరావు, అడపా రవి, పసుపులేటి రవికుమార్, టీడీపీ నేతలు రాజు, రావి చిట్టి పాల్గొన్నారు.





గౌరవ వందనం చేస్తున్న ఆర్డీవో పద్మావతి



చల్లపల్లిలో పారిశుధ్య కార్మికులకు సత్కారం



గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రదర్శన

అరుణసారిక పతాకావిష్కరణ

మచిలీపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి అరుణసారిక జాతీయజెండాను ఎగురవేశారు. జిల్లాపరిషత్ ప్రాంగణంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాలహారిక, కేడీసీసీబీ కార్యాలయం వద్ద బ్యాంక్ సీఈవో శ్యామ్‌మనోహర్ జాతీయజెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

హనుమంతపురంలో...

పమిడిముక్కల : సీఐ కిషోర్‌బాబు, హనుమంతపురం జడ్పీహెచ్‌స్కూల్‌లో విద్యాకమిటీ చైర్మన్ రాజులపాటి శివనాగరాజు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పాములపాటి సుజాత, లింగమనేని బాబూరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, యండూరి పిచ్చేశ్వరరావు తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద డీటీ జోజి బాబు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ కాసాని వేద సుప్రజయ జాతీయ పతాకం ఎగురవేశారు. కపిలేశ్వరపురం జడ్పీ పాఠశాలలో సామాజిక వేత్త, లయన్స్‌క్లబ్ సభ్యుడు తాతినేని రమేశ్, ప్రవళి ప్రోత్సాహక నగదు బహుమతి అందజే శారు. హెచ్ఎం ప్రభాకరరావు, తాతినేని నరసింహారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కడియాల ప్రకాశరావు, జగదీశ్, బాబి, కార్యదర్శి తుమ్మల వెంకట గంగాధరరావు పాల్గొన్నారు.



పింగళి వెంకయ్య స్వగ్రామంలో హర్ ఘర్ తిరంగా రన్



కూచిపూడి : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జన్మస్థలం మొవ్వ మండలం భట్లపెనుమర్రులో విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మట్టా ఇందిర, ఉపసర్పంచ్ చలసాని వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు. పింగళి వెంకయ్య విగ్రహానికి సర్పంచ్ ఇందిర పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశభక్తిగేయాలు ఆకట్టుకున్నాయి.

విక్కుర్తి పౌష్టికాహార కిట్లు పంపిణీ



అవనిగడ్డ : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 50 మంది చిన్నారులకు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ గురువారం పౌష్టికాహార కిట్లు అందజేశారు. చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవనిగడ్డలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు రూ.50 వేల విలువ చేసే కిట్లను అందజేశారు. విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ ప్రతినిధులను చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధులు కోటేశ్వరమ్మ, రూతమ్మ, తాయారు సత్కరించారు. విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ నిర్వాహకులు విక్కుర్తి రాంబాబు, తులసీ, రాఘవా నాయుడు, న్యాయ వాదులు విక్కుర్తి రామకృష్ణ, నాంచారయ్య, గ్రామ ప్రముఖులు పులిగడ్డ చంద్ర, పున్నయ్య చౌదరి, బస్వారావు, భూపతి నాంచారయ్య, బర్మా శ్రీను, గరికపాటి గోపి, రేపల్లె మునలయ్య పాల్గొన్నారు.

బాక్సర్ అశోక్ కుమార్‌కు సత్కారం

అవనిగడ్డ : నార్త్‌అమెరికాలో రజిత సాధించిన బాక్సర్ కొల్లాటి అశోక్‌కుమార్‌ను విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి రూ.10 వేల నగదు పురస్కారం అందజేశారు. వ్యాయామోపాధ్యాయులు కమ్మిలి నాంచారయ్య, కోటేశ్వరరావు, బడే వెంకటేశ్వరరావు, విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాల ప్రదానం

మోపిదేవి : విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని ప్రముఖులు తెలిపారు. మోపిదేవి మాజీ సర్పం చ్, సీపీఐ సీనియర్ నాయకుడు కంఠమనేని అచ్యుత రామయ్య జ్ఞాపకార్థం 13వ విడత ప్రతిభా పురస్కారాల పంపిణీ జడ్పీ పాఠశాలలో జరిగిం ది. ప్రధానోపాధ్యాయురాలు పి.జయంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ ఫలితాలు కనబర్చిన ముగ్గురు విద్యార్థులు వన్నెంరెడ్డి లావణ్య , జాషువా, పెదసింగు హేమలకు రూ.10 వేల చొప్పున జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు రావి నాగేశ్వరరావు అందజేశారు. ఆరవ తరగతి విద్యార్థులు వరికూటి సుబ్రహ్మణ్యం, తోట ధనసూర్య కార్తీక్ సాయి, పరసా సన్నిలకు రూ.15 వేల విలువతో మూడు సైకిళ్లను అందజేశారు. అచ్యుత రామయ్య ట్రస్ట్ సభ్యులు పాలడుగు రత్నబాబు, కంఠమనేని కుటుంబరావు, శ్రీనివాసరావు, కావూరి కోదండ రామయ్య, విద్యాకమిటీ చైర్మన్ సిహెచ్.లక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.



కొసరాజుకు నేతల శుభాకాంక్షలు

గుడ్లవల్లేరు : అమెరికా పర్యటన ముగించుకొని స్వగ్రామం వచ్చిన మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరిని టీడీపీ నాయకులు, లయన్స్ ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జంగం మోహనరావు, చాపరాల గాంధీ ప్రసాద్, వైపీసీ ప్రసాద్, బొర్రా నాగేశ్వరరావు, నవాబు,పెరుమాళ్ళు, శశికళ, పెంటపాటి చిట్టిబాబు, మూల్పూరి సుధాకర్, పోలవరపు వెంకటావు, పెన్నేరు రమేష్, గరికపాటి రాంబాబు, సుబ్రహ్మణ్య చౌదరి, పరంధామయ్య, ఫణిగోపాల్ ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్ : ఇంగ్లీషుపాలెంకు చెందిన పేద విద్యార్థిని కరీష్మాబేగంకు తెలుగు యువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్ రూ. 18 వేల ఆర్థిక సాయం అందజేశారు. హెల్పింగ్ స్పాట్ సంస్థ ఫౌండర్ భార్గవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెల్పింగ్ స్పాట్ సభ్యులు సుకన్య, చరణ్, సహాయ ఫౌండేషన్ సభ్యుడు ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కొనకళ్ల నారాయణరావు

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

కోడూరు : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని మాజీ ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూటమి నేతలు బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరిరావు, ముద్దినేని చంద్రరావు, బచ్చు వెంకటేష్ ఆధ్వర్యంలో దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విజయవాడ హెల్ప్ ఆసుపత్రి వైద్యులు 150 మంది రోగులకు ఉచిత గుండె పరీక్షలు చేసి మందులు అందజేశారు. పూతబోయిన శ్రీనివాసరావు, సుంకర లక్ష్మి, బడే భావన్నారాయణ, పిల్లి మల్లిఖార్జునరావు, వేములపల్లి రాజేష్, బొడ్డు వెంకన్న, దొండపాటి శ్రీనివాసరావు, కడవకొల్లు శ్రీనివాసరావు, గోగినేని సోమశేఖరరావు, దావు మల్లిఖార్జునరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, మేడా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం.. నేటి పాలకులూ మంచివారే!

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పినట్టుగా.. 'రాజ్యాంగం ఎంత మంచిదైనా అది అమలు చేసేవాడు మంచివాడు కాకపోతే అది చెడు ఫలితాలనిస్తుంది'. రాజ్యాంగంతో పాటు ఇప్పుడు పాలకులూ మంచి వారే కాబట్టి ప్రజలకు నూటికి నూరుశాతం మంచే జరుగుతుంది. మంచి చేసే మా ప్రభుత్వానికి మీ ఆశీస్సులు సదా ఉండాలి.

అన్నదానంలో అందరూ భాగస్వాములు కావాలి

అన్నదాన కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలి. నలుగురికి అన్నం పెట్టే కార్యక్రమానికి విరాళాలు ఇచ్చి ఆ మంచిలో మీరూ భాగస్వాములు కావాలి. మీ పుట్టిన రోజు, పెళ్లి రోజు, మీ ఇంట్లో శుభకార్యాల రోజున మీరు విరాళం ఇస్తే, మీ పేరుతో ఆరోజు అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం పెడతాం

- చంద్రబాబు

రాష్ట్రానికి ఐదేళ్ల తర్వాత మళ్లీ స్వాతంత్ర్యం

కూటమి ప్రభుత్వం శాంతిభద్రతలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. నేరస్థులు రాజకీయ ముసుగులో వచ్చి రౌడీయిజం చేస్తే ఉపేక్షించేది లేదు. మా ప్రభుత్వంలో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపులకు తావులేదు. కానీ తప్పు చేసిన ఎవరినీ.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. అవినీతికి పాల్పడి, ప్రజల ఆస్తులను దోచుకున్న వారి నుంచి ఆ ఆస్తులు చట్టపరంగా తిరిగి రాబట్టి ప్రజలకు అందేలా చేస్తాం.

విధ్వంసక పాలన నుంచి విముక్తి.. ఇక అభివృద్ధితో దూసుకుపోతాం.. అక్టోబరు 2న విజన్-2047 విడుదల

నదుల అనుసంధానం చేసి తీరుతాం.. కక్ష సాధింపులు ఉండవు.. తప్పుచేసిన వారిని వదలం.. స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్ల చీకటి పాలనతో విసిగిపోయిన ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని, విధ్వంసక పాలన నుంచి విముక్తి కలిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'రాజధాని కూడా లేని పరిస్థితుల్లో నాడు పాలన ప్రారంభించాం. ఎక్కడ కూర్చుని పనిచేయాలో కూడా తెలియని అనిశ్చితి నుంచి పాలన మొదలుపెట్టి ప్రభుత్వాన్ని పట్టాలెక్కించాం. రాష్ట్రానికి నడిబొడ్డుగా ఉండే అమరావతి ప్రాంతం లో రాజధానికి శంకుస్థాపన చేసుకున్నాం. సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి ఐదేళ్లలో రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యమిచ్చాం. ఒక యజ్ఞం లా పోలవరాన్ని పరుగులు పెట్టించి 72 శాతం పనులు పూర్తి చేశాం. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈ పాటికే పోలవరం పూర్తయ్యేది.

ప్రజల ఆశలు నెరవేరుస్తాం

'120కి పైగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, శాంతిభద్రతలు, అందరికీ ఉపాధి, పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలతో రాష్ట్రం దూసుకుపోతున్న క్రమంలో 2019లో వచ్చిన ఎన్నికల ఫలితాలు రాష్ట్రాన్ని చీకటిమయం చేశాయి. ప్రజావేదిక ధ్వంసంతో ప్రారంభమై నాటి విధ్వంస పాలనతో సంపద సృష్టి, ఉపాధి కల్పనా కేంద్రమైన ప్రజారాజధాని అమరావతిని పురిటిలోనే చంపే ప్రయత్నాలు చేశారు. గత ప్రభుత్వ అసమర్థ విధానాలతో రాష్ట్ర అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. గత ఐదేళ్ల చీకటి పాలనలో విసిగిపోయిన ప్రజల్లో చైతన్యం వెల్లువెత్తింది. 2024 ఎన్నికల్లో నిశ్శబ్ద విప్లవంతో అసాధారణ విజయంతో కూటమికి పట్టం కట్టారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి ఏకపక్షంగా పట్టం కట్టారు. కొత్త ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలు పెట్టుకున్నారు. వాటిని నెరవేర్చేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది.

హామీల అమలుతో మాట నిలబెట్టుకున్నాం

'గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను తిరిగి పొందేందుకు విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజే ఐదు కీలక అంశాలపై సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నాం. బాధ్యతలు స్వీకరించిన రోజునే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేసి చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా చేశారు. అందుకే రెండో సంతకంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. పింఛను మొత్తాన్ని పెంచి ఇంటివద్దే పంపిణీ చేస్తున్నాం' అని చెప్పారు. 'యువత నైపుణ్యం పెంచేందుకు.. దేశంలోనే తొలిసారి నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టి, ఐదో సంతకం దీనిపైనే పెట్టాం. గత ప్రభుత్వ ఇసుక దోపిడీపై సీఐడీ విచారణ జరిపిస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉచిత ఇసుక విధానంపై నిర్ణయం తీసుకున్నాం. అందరి అభిప్రాయాలు తీసుకుని స్వర్ణాంధ్రప్రదేశ్-విజన్-2047ను అక్టోబరు 2న విడుదల చేస్తాం.

రైతులకు సాయం అందిస్తాం

రైతు సబ్సిడీలను త్వరలో పునరుద్ధరిస్తాం. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తాం. అన్నదాత పథకం కింద ఏడాదికి ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తాం. రానున్న వంద రోజుల్లో కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకొస్తాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రాన్ని మళ్లీ అగ్రగామిగా చేస్తాం. పారిశ్రామికాభివృద్ధికి భోగాపురం కేంద్రంగా మారనుంది'.

ఇంగ్లీషుకు ప్రోత్సాహం.. మాతృభాషకు ప్రాధాన్యం

'ఇంగ్లీషు భాషకు ప్రోత్సాహమిస్తూనే ప్రాథమిక స్థాయి నుంచి మాతృభాష అయిన తెలుగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. 2014-19 నాటి పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించాం. గిరిజన ప్రాంతాల్లో ఫీడర్ అంబులెన్స్‌ల వ్యవస్థలను బలోపేతం చేస్తాం. ఎన్టీఆర్ బేబీ కిట్స్‌ను తిరిగి ప్రవేశపెడతాం' అని చంద్రబాబు చెప్పారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కండి

ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా దేశంలో జనాభా పెరుగుదలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చంద్రబాబు చెప్పారు. 'ఇప్పటివరకు జనాభా నియంత్రణపై దృష్టి పెట్టాం. నేడు జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాలి. లేకపోతే రానున్న రోజుల్లో వృద్ధుల సంఖ్య పెరిగి పనిచేసే వాళ్ల సంఖ్య తగ్గుతుంది' అని తెలిపారు. గతంలో పీ3 విధానంతో సంపద సృష్టించామని, ఇప్పుడు పీ4 పీపుల్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంతో జీరో పావర్టీ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయం

- ఆ దిశగా అడుగులు వేస్తున్నాం
- ప్రజాధనాన్ని దోచుకున్న వారిపై చర్యలు తప్పవు: పవన్ కల్యాణ్



కాకినాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అన్నివిధాలా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామన్నారు. గత ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. 78వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా పవన్ గురువారం కాకినాడలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, ప్రసంగించారు. గత ప్రభుత్వంలో గాడి తప్పిన వ్యవస్థలకు పునర్వైభవం తీసుకురావడంతోపాటు ఆర్థికంగా అతలాకుతలమైన రాష్ట్రానికి జీవం పోస్తామన్నారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా విధించుకుని పని చేస్తామని తెలిపారు.

సోషల్ మీడియాలో తప్పుగా మాట్లాడే వారిపై నిఘా..

'గత ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. సోషల్ మీడియాలో మహిళలపై తప్పుగా మాట్లాడే వారిపై నిఘా పెడతాం. మహిళలు, ఆడబిడ్డలను కించపరిచేలా అసభ్యంగా మాట్లాడే వారిని ఊపేక్షించం. సోషల్ మీడియాలో పోస్టుల దగ్గర నుంచి మెసేజ్‌ల వరకు ఆడబిడ్డలపై వేధింపులకు పాల్పడే వారిని వదిలే ప్రసక్తి లేదు' అని పవన్ హెచ్చరించారు. ప్రజలకు అవసరమైన విషయాలపై గత ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించలేదన్నారు.

కూతురు ఆద్యతో పవన్ సెల్ఫీ

కాకినాడ సిటీ, ఆగస్టు 15: కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వేదికపై తన కూతురు ఆద్యతో సెల్ఫీ తీసుకున్నారు. దీంతో ఒక్కసారిగా గ్యాలరీ నుంచి అభిమానులు కేరింతలు కొట్టారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ టాప్ జీప్‌పై నుంచి గౌరవ వందనం స్వీకరిస్తూ పవన్‌కల్యాణ్ వేదిక వద్దకు వస్తున్న సమయంలో పబ్లిక్ గ్యాలరీ నుంచి సందర్శకులు కేరింతలు కొట్టారు. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులు నృత్య ప్రదర్శన చేస్తున్నపుడు పవన్ వేదిక మీద నుంచి వారివద్దకు వచ్చి అభినందించారు.

పవన్‌కు బొకే ఇచ్చి.. సెల్యూట్ చేసిన డాగ్

స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు డాగ్ షో అందరినీ ఆకట్టుకుంది. ఈ షోలో పవన్‌కల్యాణ్‌కు డాగ్ బొకే ఇచ్చి సెల్యూట్ చేసింది. ఆ బొకే అందుకున్న పవన్.. ప్రతిగా ఆ డాగ్‌కి సెల్యూట్ చేశారు.



విజయవాడలోని ఐజీఎం స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు



అమరావతిలోని హైకోర్టు ప్రాంగణంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



అసెంబ్లీ ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న పీసీసీ చీఫ్ షర్మిల





డిప్యూటీ సీఎంకు బొకే తెస్తున్న పోలీసు జాగిలం, బొకే ఇచ్చిన జాగిలానికి నమస్కరిస్తున్న పవన్

సముద్ర గర్భంలో మువ్వన్నెల రెపరెపలు



సముద్రంలో 78 అడుగుల లోతున జాతీయ జెండాను ఎగురవేసిన స్కూబా డైవర్స్

సాగర్‌నగర్: విశాఖకు చెందిన 'లైవ్ ఇన్ అడ్వంచర్స్' సభ్యులు గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సముద్రంలో 78 అడుగుల లోతులో జాతీయ జెండాను ఎగురవేసి ఔరా అనిపించారు. రుషికొండ తీరం సమీపంలో 'అడ్వంచర్స్' డైరెక్టర్ బలరాంనాయుడు ఆధ్వర్యంలో స్కూబా డైవర్స్ జాతీయ జెండాను చేబూని సముద్ర గర్భంలోకి వెళ్లి జాతీయ జెండాను రెపరెపలాడించారు.

భరతమాత విగ్రహ పునఃప్రతిష్ఠ

- గతంలో జగన్ ఇంటిముందు తొలగించిన చోటే..

తాడేపల్లి టౌన్, ఆగస్టు 15: తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ ఇంటికి వెళ్లే రోడ్ మొదట్లో గతంలో తొలగించిన చోటే భరతమాత విగ్రహాన్ని గురువారం మళ్లీ పునఃప్రతిష్ఠ చేసి ఆవిష్కరించారు. నాడు జగన్ ఇంటి ముందు విశాలమైన రోడ్డు నిర్మాణం కోసం పేదల ఇళ్ల తొలగింపుతోపాటు ఎన్నో ఏళ్లుగా ఉన్న భరతమాత విగ్రహాన్ని అప్పట్లో అధికారులు తొలగించారు. భరతమాత సర్కిల్‌గా పేరుగాంచిన ఆ ప్రాంతంలో విగ్రహ తొలగింపును అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీతోపాటు బీజేపీతో సహా పలు పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. అవేమీ పట్టించుకోకుండా అర్ధరాత్రి సమయంలో క్రేన్ సాయంతో విగ్రహాన్ని తొలగించేశారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగనే, మాజీ సీఎం జగన్ ఇంటి ముందు ఉన్న రోడ్‌కు ఆంక్షలు తొలగించి, అందరూ ప్రయాణించే విధంగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్ చేశారు. అదే విధంగా రోడ్ కోసం తొలగించిన భరతమాత విగ్రహాన్ని అదే ప్రదేశంలో ఆవిష్కరించడంతోపాటు పురప్రజలు హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి భరతమాత విగ్రహాన్ని ఆవిష్కరించి, అందరితో జాతీయ గీతాలపన చేయించారు.



భరతమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన శివస్వామి, బీజేపీ నేతలు

మన్యంలో త్రివర్ణం రెపరెపలు

పెదబయలు, ఆగస్టు 15: అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో మారుమూల గ్రామాలైన ఇంజరి, జామిగూడ, గిన్నెలకోట పంచాయతీల్లో మొట్టమొదటిసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మూడు పంచాయతీల కేంద్రాలతో పాటు పలు శివారు గ్రామాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఒకప్పుడు ఈ ప్రాంతం మావోయిస్టులకు కంచుకోటగా ఉండేది. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను బహిష్కరించాల్సిందిగా సుమారు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టులు (అంతకుముందు పీపుల్స్‌వార్) పిలుపు ఇస్తుండేవారు. దాంతో వేడుకలు జరిపేందుకు ఎవరూ ధైర్యం చేసేవారు కాదు. తమకు తెలిసినంత వరకూ జెండా ఎగురవేయడం ఇదే మొదటిసారని ఆయా గ్రామాల్లోని వృద్ధులు చెబుతున్నారు.



జామిగూడ ప్రాథమిక పాఠశాలలో మొదటిసారి ఎగిరిన జాతీయ జెండా

మారుమూల ప్రాంతాలకు న్యాయ సేవలు

- వసతుల కల్పనకు త్రికరణశుద్ధితో పనిచేస్తున్న ఏపీ ప్రభుత్వం
- హైకోర్టులో ఆగస్టు 15 వేడుకల్లో సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- చట్టసభల్లో ఫలప్రదమైన చర్చలు జరగాలి: స్పీకర్ అయ్యన్న

అమరావతి, న్యూఢిల్లీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం సీజే మాట్లాడుతూ... 'సాధారణ ప్రజలకు న్యాయం అందించడంలో జరుగుతున్న జాప్యాన్ని, అవరోధాలను అధిగమించే దశలో దేశ న్యాయవ్యవస్థ ఉంది. మారుమూల ప్రాంతాలకు న్యాయసేవలను తీసుకెళ్లేందుకు, న్యాయవ్యవస్థ శక్తివంతంగా పనిచేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పనకు ఏపీ ప్రభుత్వం త్రికరణశుద్ధితో పనిచేస్తుంది' అని అన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.చిదంబరం, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎస్.ద్వారకానాథ్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ... 'స్వాతంత్ర్య ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారు. ఎంతోమంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. దేశంలో జనాభా సంఖ్యకు తగ్గట్లు న్యాయమూర్తుల సంఖ్య లేదు. ఈ కారణంగా కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఏపీలో న్యాయమూర్తుల ఖాళీలను తక్షణం భర్తీ చేయాలి' అని అన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలి: స్పీకర్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరావతి అసెంబ్లీ ముందు జాతీయ పతాకాన్ని ఎగురవేసిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 'ప్రతి పౌరుడు దేశం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, తన కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించాలి. చట్టసభల్లో ప్రజాసమస్యలపై ఫలప్రదమైన చర్చలు జరగాలి' అని ఆకాంక్షించారు. అసెంబ్లీ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు మాట్లాడుతూ... 'ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన పేదలందరికీ అందాలి. అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు' అని అన్నారు.

న్యూఢిల్లీ ఏపీ భవన్‌లో...

దేశ రాజధానిలోని ఏపీ భవన్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, అడిషనల్ కమిషనర్ హిమాంశు కౌశిక్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.



ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లోకేశ్

రాజ్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం ఘనంగా జరిగింది. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఆయన సతీమణి గుడియా ఠాకూర్ హాజరయ్యారు. చంద్రబాబు దంపతులు, పవన్ కల్యాణ్, హైకోర్టు సీజే దంపతులు... గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులను కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. జాతీయ గీతాలాపన అనంతరం అతిథుల వద్దకు గవర్నర్ వెళ్లి పేరు పేరున పలకరించారు. ఆరు గంటలకు జాతీయ గీతాలాపనతో ఎట్ హోం కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ దంపతులు, డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర దంపతులు, మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, ఎంపీలు కేశినేని చిన్ని, బాలశౌరి, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాలు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మువ్వన్నెల జెండాను ఎగురవేసి.. పోలీసులు, ఎన్‌సీసీ, మాజీ సైనికుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతను ప్రతిబింబించే శకటాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగర ప్రజలు తిలకించేందుకు వీలుగా వేడుకల అనంతరం ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానం నుంచి బెంజ్‌సర్కిల్, రామవరప్పాడు రింగ్, విజయాటాకీస్, ఓల్డ్ బస్టాండ్, రాఘవయ్య పార్కు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం తదితర ప్రాంతాల మీదుగా శకటాల ప్రదర్శన నిర్వహించారు.

పాఠశాల విద్య శకటానికి మొదటి బహుమతి

రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన 9 శాఖలు శకటాలను ప్రదర్శించగా, పాఠశాల విద్యాశాఖ శకటం మొదటి బహుమతి సాధించగా, పశు సంవర్ధకశాఖ, మహిళాభివృద్ధి-శిశు సంక్షేమశాఖల శకటాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయశాఖ, రైతు సంక్షేమంపై పశుసంవర్ధకశాఖ, ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా సంక్షేమంపై సెర్ప్, గ్రామీణాభివృద్ధిశాఖ, అమరావతి రాజధానిపై సీఆర్‌డీఏ ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా, నగరంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు మువ్వన్నెల రంగుల దుస్తులు ధరించి కూర్చోవడంతో స్టేడియం ప్రత్యేక శోభను సంతరించుకొంది. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించినప్పుడు విద్యార్థులు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. ప్రసంగం పూర్తయ్యే దాకా ఆసక్తిగా విన్నారు. గతానికి భిన్నంగా ఈసారి క్రమశిక్షణతో స్వాతంత్ర్య వేడుకలు జరిగాయని పలువురు వ్యాఖ్యానించారు.

సంక్షేమానికి కోత పెట్టం

- సూపర్ సిక్స్ హామీలకు కండీషన్లు ఉండవు
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి లోకేశ్

గుంటూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలకు ఎలాంటి కండీషన్లు ఉండవని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అనవసరమైన నిబంధనలతో సంక్షేమ కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో కోత పెట్టబోమన్నారు. గురువారం ఉదయం గుంటూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశాన్నిచ్చారు. తొలుత జాతీయ జెండాని ఎగుర వేసి ఓపెన్ టాప్ వాహనంలో పరేడ్‌ని సందర్శించారు. అనంతరం వేడుకలకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. యువతకు 20 లక్షల ఉద్యోగా కల్పన హామీ అమలుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ, ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, ప్రతీ రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని పునరుద్ఘాటించారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు శాంతి, అహింస అనే ఆయుధాలతో స్వేచ్ఛని సాధించుకున్నారని మంత్రి చెప్పారు. ప్రజలు, ప్రజాసంఘాలు మాట్లాడేందుకు స్వేచ్ఛ లభించిందన్నారు. ప్రజలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు వచ్చిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న ఈ స్వాతంత్ర్య వేడుకల్లో అందరి కళ్లలో ఆనందం కనిపిస్తున్నదని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు అన్నతో సమానమని మంత్రి లోకేశ్ తన విధేయతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



గుంటూరులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి లోకేశ్

సేవకులమై ప్రజల కన్నీరు తుడుస్తాం

- 'వారధి' ప్రారంభంలో బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి
- వైసీపీ నేతలు ఉపాధి నిధుల్లో 500 కోట్లు కొట్టేశారని విమర్శ

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజలే దేవుళ్లన్న ఎన్టీ రామారావు, జనతా జనార్దన్ అన్న నరేంద్ర మోదీ.. వ్యాఖ్యల స్ఫూర్తితో ప్రజలకు సేవకులమై వారి కన్నీరు తుడుస్తాం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆమె 'వారధి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'రోజుకొక ప్రజా ప్రతినిధి పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల వినతులు స్వీకరిస్తారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారు. ప్రతి సమస్యను సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపి పరిష్కారం దిశగా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు పని చేస్తారు' అని అన్నారు. కాగా, గురువారం పలువురు సమస్యలపై వినతులు ఇచ్చారు. కడప జిల్లా పోరుమామిళ్ల మండలం క్రొంపాటిపల్లెలో కల్లూరి బాబు అనే వ్యక్తిని వైసీపీ నాయకుడు రాజారెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 28న హత్య చేయించినా పోలీసులు చర్య తీసుకోలేదని బాధితులు వాపోయారు. 'కృష్ణా జిల్లా వీరపనేనిగూడెం, టెంపల్లి, మర్లగూడెం గ్రామాలకు అనుకూలంగా ఉన్న ర్యాంపును నేషనల్ హైవే అధికారులు తొలగించారు. దీంతో అదనంగా నాలుగు కిలోమీటర్లు చుట్టుకుని రైల్వే గేటు దాటి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ర్యాంపు తిరిగి ఏర్పాటు చేయించాలి' అని గ్రామస్తులు కోరారు. ప్రకాశం జిల్లాలో 2019-24 మధ్య కేంద్రం ఇచ్చిన 3,383 కోట్ల ఉపాధి నిధుల్లో రూ.500 కోట్లు వైసీపీ నేతలు అవినీతి చేశారని, డ్వామా అధికారులపై విచారణ జరిపించాలని ఆ జిల్లాకు చెందినవారు కోరారు. కాగా, 40 కోట్ల మంది భారతీయుల పోరాట ఫలితమే దేశానికి స్వాతంత్ర్యమని పురందేశ్వరి అన్నారు. బీజేపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆమె మాట్లాడారు.



విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి